
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

సంగారెడ్డి 5 మెదక్

బుధవారం 7 ఆగస్టు 2024

జిల్లాల వార్తలు



పింఛన్ ఇవ్వండి సారూ..!

- ఉమ్మడి రాష్ట్రంలో అమలు
- తెలంగాణ ఆవిర్భావం తర్వాత మొండిచేయి
- ఉమ్మడి జిల్లాలో 79 మంది ఎదురుచూపు
- 2008 జూన్ 30 లోపు రిటైర్ అయిన వీఆర్వోలు, కార్యదర్శుల ఆవేదన

7లో

అక్రమ రవాణాకు కేరాఫ్..

65వ నంబరు జాతీయ రహదారి

- కిలోల కొద్దీ బంగారం రవాణా
- ఎటువంటి పత్రాలు లేకుండానే తరలింపు
- పోలీసుల తనిఖీల్లో బహిర్గతం
- ట్రావెల్స్ బస్సులే టార్గెట్‌గా దుండగులు
- అక్రమ రవాణాపై ఉక్కుపాదం : ఎస్పీ రూపేష్



ఇటీవల పట్టుకున్నఆభరణాలతో ఎస్పీ(ఫైల్)

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 6 : అక్రమ రవాణాకు 65వ నంబరు జాతీయ రహదారి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఇతర రాష్ట్రాలతో సరిహద్దులు ఉండటంతో పొరుగు రాష్ట్రాల నుంచి యథేచ్ఛగా అక్రమ రవాణా జరుగుతోంది. హైదరాబాద్-ముంబయిని కలిపే ఈ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గంజాయి, మాదకద్రవ్యాలతో పాటు బంగారం తదితర వస్తువులు అక్రమ రవాణా కూడా నిత్యం ఇదేస్థాయిలో జరుగుతోంది. ప్రైవేట్ వాహనాల్లో అక్రమ రవాణా చేస్తే పోలీసులకు దొరికిపోతామనే ఉద్దేశంతో అక్రమార్కులు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను ఎంచుకుంటున్నారు. ఎటువంటి పత్రాలు, ఆధారాలు లేకుండానే కోట్లాది రూపాయల విలువైన కిలోల కొద్దీ బంగారం రవాణా చేస్తున్నారు. ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం ముంబయి నుంచి హైదరాబాద్ వస్తున్న ఆరెంజ్ ట్రావెల్స్ బస్సును తనిఖీ చేయగా పూర్ణ చంద్రేష్ అనే వ్యక్తి వద్ద 4.8 కిలోల బంగారు ఆభరణాలను గుర్తించారు. ఎటువంటి పత్రాలు లేకపోవడంతో పోలీసులు ఆ బంగారాన్ని సీజ్ చేశారు. రూ. 3.50 కోట్ల విలువైన బంగారాన్ని ఎటువంటి పత్రాలు లేకుండానే నిర్భయంగా తరలించడం గమనార్హం.

ఇదే రూట్‌లో బంగారం గంజాయి

65వ నంబరు జాతీయ రహదారిపై ముంబాయి-హైదరాబాద్ మధ్య ట్రావెల్స్ బస్సుల్లో కోట్లు విలువైన బంగారం, ఇతర వస్తువులు తీసుకెళ్తుండటాన్ని గమనించిన దుండగులు టార్గెట్ చేస్తున్నారు. గత నెల 26న అర్ధరాత్రి సమయంలో చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని జహీరాబాద్‌కు సమీపంలోని కోహినూర్ దాబా వద్ద భోజనం కోసం ఆగిన ఆరెంజ్ ట్రావెల్స్ బస్సులో నుంచి 2.955 కిలోల బంగారు ఆభరణాలను అంతరాష్ట్ర దొంగల ముఠా దోచుకెళ్లంది. ఈ దోపిడీకి పాల్పడింది ఖంజర్ ఖేర్వా గ్యాంగ్‌గా గుర్తించి జిల్లా పోలీసులు వారిని ఈ నెల 4న పట్టుకున్న విషయం తెలిసిందే. ఈ రహదారిపై గంజాయి, అక్రమ మద్యం, ఇతర మాదక ద్రవ్యాలు తరలింపును అడ్డుకోవడానికి పోలీసులు నిరంతరం తనిఖీలు చేస్తున్నా అక్రమ రవాణా అరికట్టలేకపోతున్నారన్న ఆరోపణలు వెల్లువెలుత్తుతున్నాయి.



ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేస్తున్న పోలీసులు



ప్రోత్సాహమేదీ..!

ఆస్పత్రులకు లక్ష్య, ముస్కాన్, ఎన్‌క్వాస్ అవార్డులు

గుర్తింపు వచ్చి ఏడాదైనా అందని నిధులు

'కాయ'కష్టానికి దక్కని ఫలితం

ప్రొసీడింగ్స్‌తో సరి.. ఆస్పత్రుల ఖాతాలో జమకాని నిధులు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 6 : ఆస్పత్రులతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందిస్తున్న వైద్య సేవల్లో నాణ్యతా ప్రమాణాలు ఏ మేరకు పాటిస్తున్నారో పరిశీలించి నగదు ప్రోత్సాహకాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నది. ఎన్‌క్వాస్, లక్ష్య, ముస్కాన్.. కార్యక్రమాలలో భాగంగా అవార్డులను, ప్రోత్సాహక నిధులను అందజేస్తున్నది. జిల్లాలోని పలు దవాఖానాల సిబ్బంది కలిసికట్టుగా పనిచేసి అవార్డులు సాధించారు. కానీ, ఏడాదైనా ప్రోత్సాహక నగదు మాత్రం అందలేదు. అవార్డులకు ఎంపికైన ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాలకు నిధులు మంజూరైనట్లు మార్చి నెలలో ప్రొసీడింగ్స్ వచ్చినట్లు అధికారులు పేర్కొన్నా.. ఖాతాల్లో డబ్బులు మాత్రం జమ కాలేదు.

అవార్డులు ప్రకటించినా పైసలు రాలేదు

జిల్లాలోని పలు ఆస్పత్రులు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పురస్కారాలకు ఎంపికయ్యాయి. సంగారెడ్డిలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్) లక్ష్య ముస్కాన్ అవార్డులకు ఎంపికైంది. 91.0 స్కోర్‌తో ముస్కాన్ అవార్డుకు ఎంపికైనట్లు గతేడాది మే 26న ప్రభుత్వం ప్రకటించింది. ఈ అవార్డుకు ఎంపికైతే ఏడాదికి రూ.12 లక్షల చొప్పున మూడేళ్లకుగాను రూ.36 లక్షల ప్రోత్సాహక నగదు మంజూరు చేస్తారు. కానీ ఇంతవరకు నయాపైసా రాలేదు. ఇదే ఎంసీహెచ్ 'లక్ష్య' అవార్డుకు సైతం ఎంపికైనట్లు జూన్ 5న ప్రకటించింది. 'లక్ష్య' అవార్డు వరిస్తే ఏటా రూ.12 లక్షల చొప్పున మూడేళ్లకుగాను రూ.36 లక్షల నిధులు ప్రోత్సాహకంగా ఇస్తామని ప్రకటించారు. కానీ, ఏడాది గడిచినా రెండు అవార్డులకు సంబంధించి నిధులు మాత్రం రాలేదు.

- జహీరాబాద్ ఏరియా ఆస్పత్రి కూడా ముస్కాన్ అవార్డుకు ఎంపికైనట్లు గతేడాది డిసెంబరు 1న కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈమేరకు ఏటా రూ.9 లక్షల చొప్పున మూడేళ్ల పాటు రూ.27 లక్షలు ఆస్పత్రికి మంజూరు చేయాల్సిఉంది. కానీ, ఇప్పటివరకు ఒక్క రూపాయి రాలేదని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.
- జిల్లా వైద్యఆరోగ్యశాఖ పరిధిలోని మార్క్స్‌నగర్, ఇంద్రనగర్ యూపీహెచ్‌సీలతో పాటు న్యాల్‌కల్, మునిపల్లి, కంగ్టి, బొల్లారం, ఆత్మకూర్, ఝరాసంగం, రాయికోడ్, మొగుడంపల్లి, ఆర్సీపురం, కొండాపూర్ పీహెచ్‌సీలు కూడా గతేడాది ఎన్‌క్వాస్ అవార్డులకు ఎంపికయ్యాయి. ఆయా ఆరోగ్య కేంద్రాలకు రూ.3 లక్షల చొప్పున మూడేళ్ల పాటు రూ.9 లక్షల నిధులు మంజూరుకావాల్సి ఉన్నా.. ఇప్పటివరకు ప్రోత్సాహక నగదు మాత్రం అందలేదని ఆయా ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు తెలిపారు.

కష్టానికి దక్కని ఫలితం

ఆస్పత్రుల్లో నాణ్యతా ప్రమాణాలు పెంచడంపై దృష్టిసారించి నిర్దీత పురోగతి సాధించిన ఆస్పత్రులకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహకాలు అందిస్తున్న విషయం తెలిసిందే. అయితే లక్ష్య, ముస్కాన్, ఎన్‌క్వాస్ పురస్కారాల సాధనలో రెండు, మూడు నెలల ముందస్తు కృషి ఉంటుంది. క్షేత్రస్థాయిలో నాణ్యత ప్రమాణాల మెరుగు, రికార్డుల నిర్వహణలో అధికారులు, వైద్య సిబ్బంది పాత్ర కీలకంగా ఉంటుంది. అవార్డు సాధించిన ఆస్పత్రులకు మంజూరైన ప్రోత్సాహక నగదులో 75 శాతం ఆస్పత్రి అభివృద్ధికి, 25 శాతం వైద్య సిబ్బందికి ప్రోత్సాహకంగా అందజేస్తారు. ప్రోత్సాహక నగదును విడుదల చేస్తే సిబ్బంది మరింత చురుకుగా పనిచేసేందుకు ఆస్కారం ఉంటుంది.

బోర్పట్ల ఎంపీపీఎస్

హెచ్‌ఎం సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ చేసిన డీఈవో
- బడులు ప్రారంభమైనా పుస్తకాల పంపిణీలో నిర్లక్ష్యం
- కలెక్టర్ తనిఖీలో వెలుగులోకి రావడంతో వేటు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 6 : హత్నూర మండలం బోర్పట్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజును సస్పెండ్ చేస్తూ డీఈవో వెంకటేశ్వర్లు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి మంగళవారం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ క్రమంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇంకా పంపిణీ చేయకపోవడాన్ని కలెక్టర్ గుర్తించారు. పాఠశాలల ప్రారంభమై రెండు నెలలైనా పుస్తకాలు పంపిణీ చేయకపోవడమేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెచ్ఎం రాజును సస్పెండ్ చేయాలని డీఈవోను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వెలువరించినట్లు డీఈవో తెలిపారు.



నారాయణఖేడ్‌లో డబుల్‌బెడ్రూం ఇళ్లు

గృహప్రవేశానికి ముందే

శిథిలావస్థకు!

కిటికీలు, తలుపులు, నీళ్ల ట్యాంకులు ధ్వంసం

లబ్ధిదారులను ఎంపికచేసి చేతులు దులుపుకున్న అధికారులు

నారాయణఖేడ్‌లో డబుల్‌బెడ్రూం ఇళ్ల దుస్థితి

నారాయణఖేడ్, ఆగస్టు 6: గత ప్రభుత్వం ప్రారంభించిన డబుల్‌బెడ్రూం గృహాలు లబ్ధిదారులకు అందకుండానే శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఏళ్ల తరబడి నిర్మాణ పనులు కొసాగినా.. ఇంకా కొన్ని అసంపూర్తి దశలోనే ఉండగా.. పూర్తయినవి కూడా లబ్ధిదారులకు అందలేదు. ఫలితంగా ఈ గృహసముదాయాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి. నారాయణఖేడ్ శివార్లలో 66 బ్లాకుల్లో 795 గృహాలను నిర్మించారు. ఒక్కొక్క గృహానికి రూ.5.04 వేలతో నిర్మించడానికి ప్రభుత్వం పనులను కాంట్రాక్టర్లకు అప్పగించింది. మొదటి దశలో చేపట్టిన 130 గృహాల పనులు పూర్తి కాగా, ఆ తర్వాత చేపట్టిన గృహాల పనులు ఇంకా అసంపూర్తి దశలోనే ఉన్నాయి. కొన్ని గృహాలకు సంబంధించిన కిటికీల అద్దాలు ధ్వంసమయ్యాయి. గృహాలకు నెర్రెలు వారాయి. మరికొన్ని గృహాల శానిటేషన్ పైప్‌లైన్ ధ్వంసమయ్యాయి. గృహాలపైన ఏర్పాటు చేసిన ట్యాంకులు కూడా ధ్వంసమయ్యాయి. నారాయణఖేడ్ శివార్లలో నిర్మించిన గృహాలకు సంబంధించి దాదాపు 2వేల మంది దరఖాస్తులు చేసుకోగా, అర్హులైన వారి వివరాలను సేకరించిన అధికారులు రెండేళ్ల క్రితం నిర్మించిన గృహాల కంటే అర్హులైన వారి సంఖ్య ఎక్కువగా ఉండడంతో లక్కీడ్రా ద్వారా ఎంపికచేశారు. కేటాయించిన గృహాల పనులు పూర్తి కాకపోవడంతో ఎవరికీ స్వాధీనం చేయలేదు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో గతంలో ఎంపికచేసిన లబ్ధిదారులకే గృహాలను కేటాయిస్తారా? మళ్లీ ఎంపిక ప్రక్రియ చేపడతారా? అని లబ్ధిదారులు సంశయం వ్యక్తంచేస్తున్నారు. డబుల్‌బెడ్రూం ఇళ్ల పంపిణీ అంశంపై ఏఈ రాకేష్ స్పందిస్తూ 130 గృహాల పనులు మాత్రమే పూర్తయ్యాయని, మిగతా గృహాలకు సంబంధించి పనులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వివిధ కారణాలతో కాంట్రాక్టర్లు పనులు చేయడం లేదని తెలిపారు.



ఓ ఇంటిపై ధ్వంసమైన నీళ్ల ట్యాంకు, పైప్‌లైన్

ఆటో బోల్తా.. ఇద్దరు మృతి



మల్లేశం (ఫైల్)



యూసుఫ్ (ఫైల్)

హత్నూర, ఆగస్టు 6: ఆటో బోల్తా పడి డ్రైవర్, ప్రయాణికుడు మృతి చెందిన సంఘటన హత్నూర మండలం తుర్కలఖానాపూర్ గ్రామ శివారులో సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరా ప్రకారం పటాన్‌చెరు మండలం పెద్దకంజర్ల గ్రామానికి చెందిన గొల్ల మల్లేశం (47) తన ఆటోలో సోమవారం ఉదయం మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో బంధువుల వద్దకు వెళ్లి రాత్రి ఇంటికి తిరుగు ప్రయాణమయ్యాడు. మధ్యలో దౌల్తాబాద్ వద్ద గ్రామానికి చెందిన యూసుఫ్ బేగంపేటకు వెళ్లేందుకు ఆటోలో ఎక్కాడు. హత్నూర మండలం తుర్కలఖానాపూర్ గ్రామ శివారులోకి రాగానే ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవర్ గొల్ల మల్లేశం, యూసుఫ్ (51) అక్కడికక్కడే మృతి చెందాడు. సాయంత్రం వరకు ఇంటికి వస్తానన్న మల్లేశం రాత్రవుతున్నా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుక్కుంటూ దౌల్తాబాద్ వైపు వస్తుండగా రోడ్డు పక్కన బోల్తాపడిన ఆటోను గుర్తించారు. అప్పటికే ఇద్దరు మృతిచెందారు. మృతుడు యూసుఫ్‌కు భార్య, ముగ్గురు కూతుళ్లు, కొడుకు ఉండగా, గొల్ల మల్లేశంకు భార్య, కూతురు, కొడుకు ఉన్నారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



స్టుడియం సిబ్బందితో మాట్లాడున్న

స్టేడియం అభివృద్ధికి ప్రతిపాదనలు : డీవైఎస్‌వో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 6 : జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియం అభివృద్ధి కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి మొగల్ ఖాసీంబేగ్ పేర్కొన్నారు. 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన 'ఆ డేదెలా?' కథనానికి ఆయన స్పందించి స్టేడియంను తనిఖీ చేశారు. ధ్వంసమైన స్టేడియం ప్రహరీ, నిలిచిన ఇండోర్ స్టేడియం నిర్మాణాలతో పాటు క్రీడా సామగ్రి, వసతులను పరిశీలించారు. తక్షణం చేయాల్సిన మరమ్మతులు, ఆధునికీకరణ పనులకు కలెక్టర్ అనుమతి కోరనున్నట్లు తెలిపారు. పటాన్‌చెరు, నారాయణఖేడ్‌లోని మైదానాల అభివృద్ధికి కూడా కలెక్టర్ ద్వారా స్పోర్ట్స్ అథారిటీకి ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు.

గురుకులంలో సమస్యలను పరిష్కరిస్తా..

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



గురుకుల పాఠశాల విద్యార్థినులతో మంత్రి దామోదర్ రాజనర్సింహ

జోగిపేట, ఆగస్టు 6: అందోలు పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హామీ ఇచ్చారు. బాలికల గురుకులాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పాఠశాలలో ఆడిటోరియం, కిచెన్, డైనింగ్ హాల్, టాయిలెట్‌బ్లాక్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. డిజిటల్ టీచింగ్ మెటీరియల్‌ను ఏర్పాటు చేస్తానన్నారు. ఈ పనులకు సంబంధించి మూడు రోజుల్లో ప్రతిపాదనలు సిద్ధం చేయించాలని నిర్దేశించారు.



గోపూజ చేస్తున్న మంత్రి దామోదర్

వాసవీమాత పారాయణం ముగింపు

జోగిపేటలోని వాసవీ కల్యాణ మండపంలో జరిగిన సామూహిక వాసవీమాత పారాయణ ఉత్సవాల ముగింపు కార్యక్రమానికి మంత్రి దామోదర్ హాజరయ్యారు. వాసవీ మాత విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోపూజలో పాల్గొన్నారు. ఆయనవెంట మున్సిపల్ కమిషనర్ తిరుపతి, చైర్మన్ మల్లయ్య, వైస్ చైర్మన్ డేవిడ్, కౌన్సిలర్లు డాకూరి శంకర్, సురేందర్‌గౌడ్, పట్లోళ్ల రేఖాప్రవీణ్, రంగ సురేశ్, చిట్టిబాబు, ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు గోలి పద్మ, పోల అనిత, గజాడ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిపల్లి పీహెచ్‌సీ భవనాన్ని

పరిశీలించిన డీఎంహెచ్‌వో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నర్సాపూర్, ఆగస్టు 6: రెడ్డిపల్లి పీహెచ్‌సీని జిల్లా వైద్యాధికారి మంగళవారం సందర్శించారు. 'రోగమొచ్చిందని దవఖానకు వస్తే.. షాక్ కొడుతున్నది' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 5వ తేదీన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సృజన భవనాన్ని పరిశీలించారు. భవనానికి షాక్ వస్తున్న విషయంపై ఆరా తీశారు. అనంతరం స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా పీహెచ్‌సీ భవన ప్రాంగణంలో మొక్కలు నాటారు.



రెడ్డిపల్లి పీహెచ్‌సీలో మొక్కను నాటుతున్న డీఎంహెచ్‌వో

సర్వేకు ససేమిరా..

వెనక్కు మళ్లిన అదనపు కలెక్టర్

పరిహారంపై స్పష్టత వచ్చే వరకు సర్వే చేయనివ్వబోమన్న రైతులు



రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నర్సాపూర్, ఆగస్టు 6: ట్రిపుల్‌ఆర్ భూసేకరణ కోసం సర్వే చేయడానికి వచ్చిన అధికారులకు మరోసారి రైతుల నుంచి ప్రతిఘటన తప్పలేదు. దీంతో సర్వే చేయకుండానే వెనుదిరిగారు. మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ కమలాద్రి మంగళవారం రెడ్డిపల్లి గ్రామంలో సర్వే కోసం వెళ్లారు. రైతులతో చర్చించి భూసేకరణకు సహకరించాలని కోరారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రీజినల్ రింగురోడ్డు నిర్మాణంతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, రైతులు సహకరించాలని కోరారు. అయితే, రైతులు మాత్రం తాము అభివృద్ధికి అడ్డుకాదని.. పరిహారంపై స్పష్టమైన హామీ ఇవ్వకుండా భూములు ఇమ్మంటే ఎలా అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే గ్రామంలో కాళేశ్వరం కాలువ, హైటెన్షన్ విద్యుత్‌లైన్ కోసం భూములు తీసుకుని అరకొర పరిహారం ఇచ్చారని గుర్తుచేశారు. మిగిలిన భూములు రోడ్డు కోసం తీసుకుంటే ఎలా బతకాలని వాపోయారు. భూమికి బదులుగా భూమి కానీ.. లేదా మార్కెట్ ధర కానీ చెల్లించాలని డిమాండ్ చేశారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి ఎక్కువ పరిహారం వచ్చేలా చూస్తానని అదనపు కలెక్టర్ కోరినా ససేమిరా అనడంతో చేసేదేమీలేక అధికారులు వెనుదిరిగారు.

డీడీలు కట్టిన గొర్రెకాపరులకు డబ్బులు చెల్లించాలి

నారాయణఖేడ్: రెండోవిడత గొర్రెల యూనిట్ల కోసం డీడీలు చెల్లించినవారికి వెంటనే అకౌంట్ల డబ్బులు వేయాలని గొర్రెకాపరుల సహకార సంఘం నాయకులు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వసంతకు వినతిపత్రం అందజేశారు.

57 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత


తూప్రాన్‌లో పట్టుబడిన రేషన్ బియ్యం లారీ

తూప్రాన్/మనోహరాబాద్, ఆగస్టు 6: తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లో అక్రమంగా తరలిస్తున్న 57 టన్నుల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. తూప్రాన్, మనోహరాబాద్ ఎస్‌ఐలు శివానందం, సుభాష్‌గౌడ్ వివరాల ప్రకారం.. హైదరాబాద్, మేడ్చల్ ప్రాంతం నుంచి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు రెండు లారీలో బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం వచ్చింది. దాంతో మనోహరాబాద్‌లో ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ ఆధ్వర్యంలో 28 టన్నులు రవాణాచేస్తున్న బియ్యం లారీని పట్టుకున్నారు. సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ సాదిక్ ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించారు. మనోహరాబాద్‌లో 28.2 మెట్రిక్ టన్నుల బియ్యం పట్టుకున్నట్లు వివరించారు. తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద నిర్వహించిన తనిఖీల్లో 29.1 మెట్రిక్ టన్నుల బియ్యం పట్టుకున్నట్లు తూప్రాన్ ఎస్‌ఐ శివానందం వివరించారు. మనోహరాబాద్‌లో డ్రైవర్ సుఖ్‌దేవ్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు. తూప్రాన్ పట్టణంలో పట్టుబడిన 620 బస్తాల్లోని 291.20 క్వింటాళ్ల బియ్యం విలువ రూ.7,57,120 లక్షలు ఉంటుందని, సీజ్‌చేసిన లారీ విలువ రూ.25 లక్షలు ఉంటుందని డిప్యూటీ తహసీల్దార్ సాదిక్ హుస్సేన్ పేర్కొన్నారు.

బాగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి

● జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్


పాఠశాలలోని వంటకాలను తనిఖీ చేస్తున్న రమేష్

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 6: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్ సూచించారు. సంగారెడ్డిలోని మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల బాలుర పాఠశాలను ఆయన మంగళవారం సందర్శించి న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల నిర్వాహకులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని సూచించారు. ముఖ్యంగా వర్షాకాలం కారణంగా పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. చదువుతోనే ఉన్నతంగా ఎదుగుతామన్న విషయాన్ని విద్యార్థులు గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం వంటశాల, బాత్‌రూమ్‌లను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం, పిల్లల వసతి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూరియా అందుబాటులో ఉంచకపోతే చర్యలు

● మెదక్ జిల్లా వ్యవసాయాధికారి గోవింద్

కౌడిపల్లి, ఆగస్టు 6: యూరియాను అందుబాటులో ఉంచని ఫర్టిలైజర్ షాపులపై చర్యలు తప్పవని మెదక్ జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ హెచ్చరించారు. మంగళవారం కౌడిపల్లి డివిజన్ పరిధిలోని చిలప్‌చెడ్, కొల్చారం, వెల్దుర్తి, మాసాయిపేట మండలాలకు చెందిన ఫర్టిలైజర్ షాపుల నిర్వాహకులతో మండల కేంద్రంలోని రైతువేదికలో ఏడీఏ పుణ్యవతి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు జరగకుండా ప్రతీ ఫర్టిలైజర్ షాపులో యూరియాను అందుబాటులో ఉంచాలన్నారు. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్‌లను రద్దు చేస్తామని పేర్కొన్నారు. వరినాటులో రెండోసారి యూరియా అవసరం ఉన్న రైతులకు నానో యూరియా ఎంతో పనిచేస్తుందని, రైతులు వాడుకునే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌడిపల్లి ఏఈవో స్వప్నజాదవ్, చిలప్‌చెడ్ ఏఈవో బాబు, కొల్చారం ఏఈవో శ్వేతకుమారి, వెల్దుర్తి ఏఈవో రూన్సీలతో పాటు ఫర్టిలైజర్ డీలర్లు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

● ప్రమాదంలో తెగిపోయిన కాలు

మర్కుక్, ఆగస్టు 6: కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు కావడంతో పాటు కాలు తెగిపోయిన సంఘటన మర్కుక్ మండలంలో చోటు చేసుకున్నది. మండల పరిధిలోని చేబర్తి గ్రామానికి చెందిన దేశమైన చంద్రం(35) ద్విచక్ర వాహనంపై గణేష్‌పల్లి నుంచి బేబర్తికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో వేగంగా వస్తున్న కారు వెనకనుంచి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో చంద్రం కుడి కాలు మోకాలి వరకు విరిగి ఊడి పడింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ దామోదర్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కాగా ఢీకొట్టిన వ్యక్తి పాములపర్తి గ్రామానికి చెందిన తాడెం బాబుగా గుర్తించి, కారును పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చామన్నారు. గాయపడిన చంద్రంను కుటుంబసభ్యులు లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆస్పత్రికి తరలించారు.

పాపం పసివాళ్లు..

● బస్టాండ్‌లో వదిలేసి వెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు



బస్టాండ్‌లో వదిలివెళ్లిన మూడేళ్ల బాలుడు, ఆరునెలల చిన్నారి

పటాన్‌చెరు, ఆగస్టు 6: తల్లి ఒడిలో హాయిగా ఆడుకోవాల్సిన మాటలు కూడా రాని పసివాళ్లను గుర్తుతెలియని వ్యక్తులు పటాన్‌చెరు బస్టాండ్‌లో వదిలివెళ్లిన హృదయవిదారకమైన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకున్నది. పటాన్‌చెరు ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు మూడేళ్ల బాలుడు, ఆరునెలల చిన్నారిని గుర్తుతెలియని వ్యక్తులు పటాన్‌చెరు బస్టాండ్‌లో వదిలివెళ్లారు. గుక్కపట్టి పిల్లలు ఏడుస్తుండగా, అక్కడే పనిచేసే స్వీపర్ గుర్తించి అక్కున చేర్చుకుంది. బస్టాండ్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పిల్లలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి సంరక్షించారు. మంగళవారం ఉదయం మహిళా శిశుసంక్షేమ అధికారులు పిల్లలను స్వాధీనం చేసుకుని సంగారెడ్డికి తరలించారు. పోలీసులు పిల్లలను వదిలిన గుర్తుతెలియని వ్యక్తులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. పిల్లల తల్లిదండ్రులు వదిలివెళ్లారా, ఎవరైనా కిడ్నాప్ చేసి ఇక్కడ వదిలివెళ్లారా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా చిన్నారులను వివరాలు అడగ్గా సరిగ్గా చెప్పలేకపోతున్నారని మహిళా శిశు సంక్షేమ అధికారులు తెలిపారు.

హత్య కేసులో నిందితులు అరెస్ట్

● వివాహేతర సంబంధమే కారణం

● అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సీఐ, ఎస్‌ఐ

అల్లాదుర్గం, ఆగస్టు 6: అల్లాదుర్గం మండలంలోని గడిపెద్దాపూర్‌లో ఈ నెల 4న జరిగిన హత్య కేసును ఛేదించి, ఆరుగురు నిందితులను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి తెలిపారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ముస్లాపూర్ గ్రామానికి చెందిన ఒకరు జూన్ 22న ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే ఇతడి భార్యతో అదే గ్రామానికి చెందిన చిత్తారి భేతయ్యకు వివాహేతర సంబంధం ఉండడం తోనే అతను ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబసభ్యులు అప్పట్లో భేతయ్యతో గొడవపడ్డారు. దీంతో భేతయ్య గ్రామాన్ని వదిలి సమీపంలోని గడిపెద్దాపూర్‌లో నివాసముంటూ గొర్రెలు మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. భేతయ్యపై కక్ష పెంచుకున్న ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి కుటుంబసభ్యులు అతడిని హతమార్చాలని భావించి అదును కోసం వేచిచూశాడు. ఈ నెల 4న భేతయ్య, మల్లేశం అనే వ్యక్తి కలిసి గడిపెద్దాపూర్ శివారులో గొర్రెలు కాస్తూ ఉన్నాడు. ఈ విషయాన్ని మల్లేశం ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి బంధువుకు ఫోన్ ద్వారా సమాచారమందించాడు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న పోచయ్య మల్లేశంతో కలిసి భేతయ్యను గొడ్డలితో హతమార్చారన్నారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టి రెండురోజుల్లోనే కేసును ఛేదించామని సీఐ తెలిపారు. హత్యకు సహకరించిన మరో నలుగురు నిందితులు రాజు, సిద్ధయ్య, రమేష్, అంబయ్యలను అదుపులోకి తీసుకొని విచారించగా ఈ నేరాన్ని అంగీకరించినట్లు వివరించారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


కనకయ్య(ఫైల్)

చిన్నకోడూరు, ఆగస్టు 6: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మతిస్థిమితం సరిగా లేని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన మండలంలోని రామునిపట్ల గ్రామ శివారులో రాజీవ్ రహదారిపై జరిగింది. ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం నంగునూరు మండలం తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన చెట్టబోయిన కనకయ్య(55) ప్రస్తుతం సిద్దిపేట పట్టణం హనుమాన్‌నగర్‌లో ఉంటున్నాడు. కనకయ్యకు మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో చిన్న పాటి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. మద్యం సేవించినప్పుడు మత్తులో ఇష్టారీతిగా తిరిగేవాడు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి రామునిపట్ల శివారులో రాజీవ్ రహదారిపై కనకయ్య నడుచుకుంటూ వెళ్తుండగా.. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తల, గదవ, కాళ్లకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మంగళవారం ఉదయం సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఓ ప్రైవేట్ వాహనంలో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా వివాహమైన కొద్దిరోజులకే కనకయ్య భార్య అతనిని వదిలి వెళ్లిపోయింది.

చరిత్రపై విస్తృత పరిశోధనలు జరగాలి

● మెదక్ అదనపు ఎస్పీ మహేందర్

మెదక్ అర్బన్, ఆగస్టు 6: చరిత్రపై విస్తృత పరిశోధనలు జరగాలని అదనపు ఎస్పీ మహేందర్ పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్ట్స్ క్యాంపస్‌లో జరిగిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మరుగునపడిన తెలంగాణ చరిత్రను వెలుగులోకి తీసుకొచ్చేందుకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. చరిత్ర విభాగం నిర్వహిస్తున్న ఈ సదస్సు విద్యార్థులకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ హుస్సేన్, చరిత్ర విభాగ అధిపతి గణపతి పాల్గొన్నారు.

పింఛన్ ఇవ్వండి సారూ..!

● ఉమ్మడి రాష్ట్రంలో అమలు

● తెలంగాణ ఆవిర్భావం తర్వాత మొండిచేయి

● ఉమ్మడి జిల్లాలో 79 మంది ఎదురుచూపు

● 2008 జూన్ 30లోపు రిటైర్ అయిన వీఆర్వోలు, కార్యదర్శుల ఆవేదన

తొగుట, ఆగస్టు 6: ఉమ్మడి రాష్ట్రంలో ఉండగా వారికి నెలనెలా పింఛన్ వచ్చేది. కానీ, రాష్ట్రం విడిపోయాక ఏపీలోకి వెళ్లిన వారికి పింఛన్ అందుతోంది. అదేం పాపమో కానీ, తెలంగాణలోని వారు మాత్రం ట్రిబ్యూనల్ ఆదేశాల మేరకు తమకు పింఛన్ ఇవ్వాలని కాళ్లరిగేలా తిరుగుతున్నారు 2008 జూన్ 30 కంటే ముందు రిటైర్ అయిన వీఆర్వోలు, గ్రామపంచాయతీ కార్యదర్శులు. గ్రామాల్లో రెవెన్యూ, శాంతిభద్రతలను చక్కదిద్దేందుకు పనిచేసిన పట్వారీ, పటేల్ వ్యవస్థను 1984లో అప్పటి సీఎం ఎన్టీఆర్ రద్దు చేశారు. ఉపాధి కోల్పోయిన వేలాదిమంది సుదీర్ఘ పోరాటం చేయగా, 1992లో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 1992లో అర్హులైన వారిని ప్రభుత్వం వీఏఓలుగా నియమించింది. అప్పట్లో రూ.600 గౌరవవేతనంతో తాత్కాలిక ఉద్యోగులుగా పని చేశారు. చివరకు పదోతరగతి, ఇంటర్మీడియట్ చదివిన వారిని 2002 జనవరి ఒకటి నుంచి పూర్తిస్థాయి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పేస్కేల్ ఇచ్చారు. వారిని వీఆర్వోలుగా, కార్యదర్శులుగా నియమించారు. అయితే, 2002లో ప్రభుత్వ ఉద్యోగులుగా నియమితులైన వీరిలో చాలామంది 2008 జూన్ 30లోగా ఉద్యోగ విరమణ పొందారు. అయితే వారికి కనీసం ఏడేళ్ల సర్వీస్ లేదంటూ పింఛన్ ఇచ్చేందుకు నిరాకరించారు. ఇలాంటి వారు ఉమ్మడి ఏపిలో 2,225 మంది ఉండగా, తాము రెండు నుంచి మూడు దశాబ్దాలుగా సేవలందించామని, తమకు కనీస పింఛన్ మంజూరు చేసేందుకు గతంలో 1992 నుంచి 2002 మధ్య కాలాన్ని కలపాలని ఏపీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. ట్రిబ్యునల్ ఆదేశాలు, 1980 ఆర్‌పీఆర్ జీవోలను పరిశీలించిన తర్వాత ఫైల్ నెం.28496/అ/2013 ప్రకారం పాత సర్వీస్‌ను పరిగణలోకి తీసుకుని 2,225 మందికి కనీస పింఛన్ సౌకర్యం కల్పిస్తూ 2014 ఫిబ్రవరి 2న ఫైల్‌పై అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి సంతకం చేశారు.

ఏపీలో అమలు... !

ఉమ్మడి రాష్ట్రంలో తీసుకున్న నిర్ణయాలను అమలుచేయాలని విభజన చట్టంలో పొందుపరిచిన మేరకు ఫైల్ 28496/అ/2013 ప్రకారం ఏపీకి చెందిన 1,733 మందికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పింఛన్ సౌకర్యం కల్పిస్తూ 2014 నవంబర్ 20న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జీవో నంబర్ 388 జారీచేశారు. దీంతో ఆ ప్రాంతంలోని రిటైర్డు వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పింఛన్ పొందుతున్నారు. తెలంగాణలో మాత్రం వారికి పింఛన్ ఇవ్వడం లేదు. రాష్ట్రంలో మొత్తం 492 మంది ఉండగా, ఒక్క ఉమ్మడి మెదక్ జిల్లాలోనే 79 మంది ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అందులో చాలామంది చనిపోయారు కూడా. అయినా వారికి పింఛన్ దక్కడం లేదు. గత ప్రభుత్వం వీరి గోడును పట్టించుకోకపోవడంతో 2017లో ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన జీవో 388 ప్రకారం తమకు న్యాయం చేయాలని రిటైర్డ్ ఉద్యోగులు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో 2021 మార్చి 15న హైకోర్టు పాత సర్వీస్‌ను పరిగణలోకి తీసుకుని వారికి పింఛన్ అందించాలని ఆదేశాలు జారీచేసినా ఇప్పటివరకు అధికారులు సహేతుక కారణాలు చూపకుండా ఫైల్‌ను పెండింగ్ ఉంచినట్లు రిటైర్డు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2024 జనవరి 12న ప్రజాభవన్‌లో రిటైర్డైన వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పింఛన్ జీవోపై జారీచేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. అదేనెల 30న రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి తమకు పింఛన్ మంజూరీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని రిటైర్డైన వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు కోరుతున్నారు.


Government of Andhra Pradesh
Abstract

Village Administration - Inclusion of ten (10) years Part time service of 1733 Village Administrative Officer's for counting for the purpose of qualifying service for pensionary benefits- Orders- Issued.

Revenue (Ser.III) Department

G.O.Ms.No.388 Dated: 20.11.2014
Read the following:

1. From the CCLA, Hyderabad, [illegible] dt.05.06.2013.
2. Govt.Memo.No.28496/VA.1/2013, dt.07.10.2013.
3. From the CCLA, Hyd. Lr.No.A2/621/2013, [illegible]
4. Govt.Memo.No.28496/Ser.III/2013, dt.19.07.2014.
5. From the CCLA, A.P., Hyd, Lr.No.A2/621/2013, dt.07.08.2014.
6. From the President, A.P. Revenue Services Association, Andhra Pradesh, Hyderabad, representation dt. 21-07-2014.
7. From the President/Genl.Secy., Village Revenue Officer's Welfare Association, Andhra Pradesh, Hyderabad, representation dt.19-07-14.

ORDER:

The system of Village Officers was in existence from British time and the same was abolished on 06.01.1984 [illegible] Act, 1985. On 11.09.1985, a new system called Village Assistants System was introduced replacing the Village Officer's System. The Post of Village Assistant was a whole time Government Servant. Further, on 07.11.1990, Government [illegible] Village Administrative Officer's (VAOs) system replacing Village Assistant's System by creating 20,000 VAO posts in the State. The post of VAO was a Part-time one and was paid honorarium.

2. Further, in G.O.Ms.No.369, PR & RD [illegible] Department, dt.12.12.2001, Government have created the post of Panchayat Secretary in each Gram Panchayat combining [illegible] Panchayat functions. The erstwhile Village Administrative Officer's who were attending the Revenue functions at Village level and were having Intermediate and SSC qualifications and below 50 years age were absorbed as Panchayat Secretaries by giving regular scale of pay as per the qualifications. In the above said G.O. it was ordered that the past service of the Village Administrative Officer's would not be considered for the purpose of pension or any other benefits. As such, the erstwhile Village Administrative Officer's who were absorbed as Panchayat Secretaries vide G.O.Ms.No.369, PR & RD [illegible] Department dt.12.12.2001 were eligible for pensionary benefits [illegible] 01.01.2002 as per the orders issued from time to time.

3. Subsequently, Government proposed to strengthen the Revenue Administration at Village level. Accordingly, in the G.O. [illegible] Revenue (VA.I) Department, dt.30.12.2009, orders were issued creating Revenue functionary at Village level under the [illegible] administrative control of the Mandal Revenue Officer [illegible] work relating to land Revenue matter at the Village level. [illegible] G.O.Ms.No.[illegible], Revenue (VA.I) Department, [illegible]

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అమలైన జీవో కాపీ ప్రతులు

నా భర్త చనిపోయే వరకు పింఛన్ కోసం ఎదురు చూసిండు..



ఎన్నోఏళ్ల నా భర్త ప్రజలకు సేవచేసిండు. రిటైర్డ్ అయిన తర్వాత పింఛన్ కోసం అధికారుల చుట్టూ తిరిగి.. చనిపోయే దాక ఆశతో ఎదురుచూసిండు.. మాఊరు మల్లన్నసాగర్‌లో ముంపునకు గురైంది. దాంతో ఎలాంటి ఆదెరువు లేకుండా పోయింది. ఇప్పుడు దిక్కులేని పక్షుల వలే మిగిలినం. ప్రభుత్వం ఇప్పటికైనా మాపై దయతలచి భర్త పింఛన్ మంజూరీ చేస్తే నాకు ఆసరాగా ఉంటుంది.

- దాతారు సులోచన (రిటైర్డ్ వీఆర్వో సుధాకర్‌రావు సతీమణి), ఏటిగడ్డ కిష్టాపూర్, తొగుట మండలం

ఇప్పుడైనా న్యాయం జరిగేనా



ఉమ్మడి రాష్ట్రంలో పింఛన్ ఇవ్వాలని జీవో విడుదలైనప్పటికీ గత ప్రభుత్వం పట్టించుకోలేదు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సమస్య పరిష్కారం కోసం ప్రజాభవన్‌లో దరఖాస్తు చేయడంతోపాటు, రెవెన్యూ మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశాం. మాకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుందని నమ్మకంతో ఎదురుచూస్తున్నాం.

- నర్సింహారావు, రిటైర్డ్ వీఆర్వోలు పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

మాకు న్యాయం చేయండి



పింఛన్ కోసం 9ఏళ్లుగా పోరాడుతూనే ఉన్నాం. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి స్పందన లేకుండాపోయింది. చాలా ఏళ్ల పాటు మిరుదొడ్డి మండలం వీరారెడ్డిపల్లిలో వీఆర్వోగా పనిచేసి రిటైర్డ్ అయ్యాను. ఇప్పుడు కుటుంబ పరిస్థితి బాగాలేదు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం మాకు పింఛన్ మంజూరీచేసి న్యాయం చేయండి.

- అమ్మన రాంరెడ్డి, రిటైర్డ్ వీఆర్వో (చెల్లాపూర్, దుబ్బాక మండలం)

మా మొర ఆలకించండి



తొగుట మండలం బండారుపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి రిటైర్డ్ అయ్యాను. అప్పటి నుంచి పింఛన్ కోసం కనిపించిన అధికారులను, నాయకులను కలిసిన. ఇప్పటివరకు మాకు న్యాయం జరగలేదు. అవసాన దశలో ఉన్నా.. మా మొర ఆలకించండి. చనిపోయేవరకైనా నాకు పింఛన్ ఇప్పించండి.

- రాంకిషన్‌రావు, రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి

ఊరునైనా విడిచిపెడతాం.. భూమిని మాత్రం విడిచిపెట్టం

●ఆందోళన వ్యక్తం చేసిన (ఆర్ఆర్ఆర్) బాధితులు


రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో వసంతకుమారి

సదాశివపేట, కొండాపూర్, ఆగస్టు 6: పుట్టి.. పెరిగిన ఊరునైనా విడిచిపెడతాం.. కానీ (రిజినల్ రింగు రోడ్డు) కోసం భూమిని మాత్రం విడిచిపెట్టమని సదాశివపేట మండలం పెద్దాపూర్, కొండాపూర్ మండలం గిర్మాపూర్ గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం పెద్దాపూర్‌లోని రైతువేదికలో సంగారెడ్డి ఆర్డీవో వసంతకుమారి, డీఎస్పీ సత్తయ్య, నేషనల్ హైవే అథారిటీ అధికారులు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడారు. (ఉత్తరభాగం-ఆర్ఆర్ఆర్) నిర్మాణం కోసం ప్రభుత్వం భూసేకరణ నిమిత్తం గత జూలై 15న నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. నోటిఫికేషన్‌లో సూచించిన సర్వే నెంబర్లలోని భూములను సర్వే చేశామన్నారు. భూసేకరణ సర్వే, ప్రజాభిప్రాయ సేకరణ పనులు 21 రోజుల పాటు కొనసాగుతాయన్నారు. ముందుగా ఎంజాయ్‌మెంట్ సర్వేచేస్తే తప్పా ఏ రైతు భూమి ఎంత విస్తీరణంలో (ఆర్ఆర్ఆర్)లో వెళ్లేది తెలిపోతుందని, రైతులందరూ సహకరించాలని ఆర్డీవో కోరారు. పలువురు రైతులు మాట్లాడుతూ గ్రామాల్లో మా ఇళ్లను కూల్చేసి (ఆర్ఆర్ఆర్) నిర్మించినా పరవాలేదు. కానీ దశాబ్దాలుగా నమ్ముకుని బతుకుతున్న మా భూములు మాత్రం ఇచ్చేది లేదన్నారు. మా భూములపైనే రాష్ట్ర అభివృద్ధి ఆధారపడి ఉందా? అంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గడిచిన 40 ఏళ్లలో మెదక్ జిల్లాలో సింగూర్ ప్రాజెక్టు, హైదరాబాద్ తాగునీటి పైప్‌లైన్ రోడ్డు, బీహెచ్ఈఎల్, బీడీఎల్, ఓడీఎఫ్, ఐఐటీ, మూడు జాతీయ రహదారుల ఏర్పాటు కోసం చిన్న, సన్నకారు రైతుల నుంచి భూములను స్వాధీనం చేసుకుని సరైన నష్ట పరిహారం ఇవ్వలేదని గుర్తుచేశారు. జిల్లాలో ఏ అభివృద్ధి ప్రాజెక్టులు పెట్టినా పేద రైతుల భూములే కనిపిస్తాయా? అని ప్రశ్నించారు. (ఆర్ఆర్ఆర్)లో బడా రాజకీయ నాయకుల భూములు, రియల్ వ్యాపారుల భూములు, కంపెనీలకు చెందిన భూములను కాపాడేలా భూసర్వే, భూసేకరణ చేస్తారా? అని రైతులు అధికారులను నిలదీశారు. కేవలం ఇద్దరు రాజకీయ నాయకుల కోసం (ఆర్ఆర్ఆర్) డిజైన్ మార్చేశారని ఆరోపించారు. భూమికి భూమి, బహిరంగ మార్కెట్ విలువతో నష్టపరిహారం అందిస్తేనే తప్పా తమ భూములను వదులుకోమని రైతులు తేల్చిచెప్పారు. భూమిని కోల్పోతామనే బాధలో మాట్లాడుతున్నామే కానీ ఎవరినీ రెచ్చగొట్టేలా మాట్లాడడం లేదని రైతులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

రవాణా కార్యాలయంలో నూతన సిబ్బంది బాధ్యతలు


వెంకటరమణ మర్యాదపూర్వకంగా కలిసిన ఎంవీఐ సత్యనారాయణ, ఇన్‌చార్జి డీటీసీ అరుణ

కంది, ఆగస్టు 6: ఉమ్మడి మెదక్ జిల్లా రవాణాశాఖ బదిలీల్లో భాగంగా హైదరాబాద్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆదేశాల మేరకు కంది పరిధిలోని సంగారెడ్డి జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో నూతన అధికారులు సిబ్బంది మంగళవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా ఇన్‌చార్జి ట్రాన్స్‌పోర్ట్ అధికారిగా అరుణ, మోటారు వాహనాల తనిఖీ అధికారిగా సత్యనారాయణ, జహీరాబాద్ ఎంవీఐగా వెంకటయ్య, క్లర్కులుగా రవీందర్‌గౌడ్, గిరి, బేగ్‌లు విధుల్లో చేరారు. మంగళవారం రవాణాశాఖ ఉమ్మడి మెదక్ జిల్లా ఉప కమిషనర్ డాక్టర్ కె.వెంకటరమణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లాలోని మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట రవాణాశాఖ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు సీసీఏ రూల్స్ ప్రకారం బాధ్యతలు నిర్వర్తిస్తూ ప్రజలకు సౌకర్యవంతమైన సేవలు అందించాలని ఆదేశించారు.

హాల్ మార్కింగ్ ఆభరణాలే కొనాలి

● బీఐఎస్ జాయింట్ డైరెక్టర్, శాస్త్రవేత్త సవిత


సంగారెడ్డిలో నిర్వహించిన అవగాహన సదస్సులో బీఐఎస్ అధికారులు, సిబ్బంది

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 6: భారతీయ ప్రమాణాల బ్యూరో నిర్ధారించిన హాల్ మార్కింగ్ ఉన్న ఆభరణాలు మాత్రమే కొనాలని బీఐఎస్ జాయింట్ డైరెక్టర్, శాస్త్రవేత్త సవిత సూచించారు. సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు హోటల్‌లో బీఐఎస్ ఆధ్వర్యంలో బంగారం వర్తక వ్యాపారులు, ఆభరణాల తయారీదారులు, వినియోగదారులకు హాల్ మార్కింగ్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బంగారు ఆభరణాల శుద్ధతను నిర్ధారించేందుకు భారత ప్రభుత్వం హాల్‌మార్కింగ్ పద్ధతిని ప్రవేశపెట్టిందని, ఇందులో భాగంగానే దేశవ్యాప్తంగా హాల్‌మార్కింగ్ కేంద్రాలు అందుబాటులో ఉన్న జిల్లాలో ఈ విధానాన్ని తప్పనిసరి చేసిందన్నారు. ప్రస్తుతానికి జిల్లాలో హాల్‌మార్కింగ్ తప్పనిసరి కాకపోయినా తయారీదారులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి బీఐఎస్ లైసెన్సులు పొందాలని సూచించారు. వినియోగదారులకు శుద్ధమైన ఆభరణాలు అందించేందుకు ప్రతిఒక్కరూ బాధ్యతగా నడుచుకోవాలని కోరారు. నాణ్యత పొందడం వినియోగదారుల హక్కు అని, ప్రతిఒక్కరూ విధిగా తమ పాత్ర పోషించాలన్నారు. ప్రతి వస్తువుపై ఐఎస్ఐ మార్కు, బంగారు ఆభరణాలపై హాల్‌మార్క్, ఎలక్ట్రానిక్ వస్తువులపై రిజిస్ట్రేషన్ మార్కు విధిగా చూడాలని, ఈ ముద్రలు కనిపించకపోతే బీఐఎస్ కేర్ యాప్ ద్వారా ఫిర్యాదు అందించాలని తెలిపారు. ఫిర్యాదు అందితే సంబంధిత తయారీ సంస్థలపై బీఐఎస్ చర్యలు చేపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో బీఐఎస్ హాల్ మార్కింగ్ ఏజెంట్ ప్రశాంతి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్స్ కోసం రోడ్డెక్కిన విద్యార్థులు

● గంటపాటు పాత హైవేపై బైఠాయింపు

● ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు

● పోలీసులతో ఏబీవీపీ నేతల వాగ్వాదం

● బలవంతంగా వ్యాన్ ఎక్కించి స్టేషన్‌కు తరలింపు

రామాయంపేట, ఆగస్టు 6: పెండింగ్ స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలంటూ విద్యార్థిలోకం రోడ్డెక్కింది. మొదట భారీ ర్యాలీగా కదిలొచ్చి పట్టణంలోని పాత హైవేపై రాస్తారోకోకు దిగారు. ఈ ఆందోళనకు ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాల విద్యార్థులు మంగళవారం తెరలేపారు. గత ప్రభుత్వం లాగానే ప్రస్తుత అధికార పార్టీ సైతం విద్యార్థులతో చెలగాటమాడుతోందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు గంటపాటు వందలాది మంది రహదారిపై బైఠాయించడంతో ఇరువైపులా వాహనాలు పెద్దఎత్తున నిలిచి ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వచ్చి విద్యార్థులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా.. ఆందోళన విరమించమంటూ భీష్మించారు. ఈ నేపథ్యంలో పోలీసులకు, ఏబీవీపీ నేతలకు వాగ్వాదం జరిగింది. దీంతో పోలీసులు విద్యార్థి నేతలను బలవంతంగా వ్యాన్ ఎక్కించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.


రామాయంపేటలో విద్యార్థుల రాస్తారోకో

తాగునీటి సరఫరా వ్యవస్థను మెరుగుపర్చండి

● రాష్ట్ర, ఆర్కియాలజీ శాఖ డైరెక్టర్ భారతీ హోళికేరి


సంగారెడ్డిలో మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయాలని అధికారులను ఆదేశిస్తున్న భారతీ హోళికేరి


శివ్వంపేట చిన్న గొట్టిముక్ల పాఠశాలలో నీటిని పరిశీలిస్తున్న భారతీ హోళికేరి

సంగారెడ్డి రూరల్/హత్నూర/శివ్వంపేట/నర్సాపూర్, ఆగస్టు 6: ప్రజల ఆరోగ్యాలు పరిరక్షించేలా తాగునీటి సరఫరా వ్యవస్థ మెరుగుపర్చాలని రాష్ట్ర, ఆర్కియాలజీ శాఖ డైరెక్టర్ భారతీ హోళికేరి అధికారులను ఆదేశించారు. స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా మంగళవారం సంగారెడ్డిలోని 32వ వార్డులో కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలిసి ఆమె సందర్శించి పరిసరాలు మంచినీటి ట్యాంకులను పరిశీలించి మాట్లాడారు. ప్రతిఒక్కరూ తమ ఇళ్లతో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్, డీపీవో సాయిబాబా, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్, డీఈ ఇంతియాజ్, వార్డు కౌన్సిలర్ తదితరులు పాల్గొన్నారు. పచ్చదనం పరిశుభ్రతపై అధికారులు, ప్రజలు సమిష్టిగా కృషిచేయాలని రాష్ట్ర, ఆర్కియాలజీ శాఖ డైరెక్టర్ భారతీ హోళికేరి, కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులకు సూచించారు. హత్నూర మండల పరిధిలోని బోర్పట్ల గ్రామాన్ని మంగళవారం సందర్శించి పాఠశాల, పల్లె ప్రకృతివనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పచ్చదనం-స్వచ్ఛదనంలో అందరినీ భాగస్వాములను చేయాలని అధికారులకు సూచించారు. ఇదిలా ఉండగా బోర్పట్ల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదని కొందరు విద్యార్థులు వారి దృష్టికి తీసుకెళ్లగా.. ప్రధానోపాధ్యాయుడిపై అసహన వ్యక్తం చేశారు. బోర్పట్ల గ్రామ శివారులోని ఎపిటోరియా పరిశ్రమలో అక్రమ నిర్మాణాలు, కాలుష్యంపై స్థానికులు కొందరు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అక్రమ నిర్మాణాలపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని అక్కడే ఉన్న జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబాను ఆదేశించారు. వారి వెంట ట్రైనీ కలెక్టర్ మనోజ్, తహసీల్దార్ ఫర్హీన్‌షేక్, ఎంపీడీవో శంకర్ ఉన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛదనం-పచ్చదనంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని రాష్ట్ర, ఆర్కియాలజీ శాఖ డైరెక్టర్ భారతీ హోళికేరి, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గొట్టిముక్ల గ్రామంలోని పాఠశాలలో తాగునీరు, మురుగు కాలువలను, రోడ్లను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్ విద్యా బోధనపై ఆరాతీశారు. పాఠశాలలో మొక్కలు నాటి నీళ్లుపోశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వర్, ఎంపీవో తిరుపతిరెడ్డి, కార్యదర్శి శ్రీకాంత్, నారాయణరావు, నరేందర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం నర్సాపూర్ పట్టణంలో రాష్ట్ర, ఆర్కియాలజీ శాఖ డైరెక్టర్ భారతీ హోళికేరి, కలెక్టర్ రాహుల్‌రాజ్ పర్యటించారు. పట్టణ సమీపంలో ఉన్న కోమటికుంట వద్ద పెద్దఎత్తున చెత్త ఉండడంతో పాటు విలువైన కుంట పరిధిలోని భూమి ఆక్రమణకు గురికావడం చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రాయరావు చెరువును సందర్శించి పర్యాటక పరంగా అభివృద్ధి చేయడానికి అవకాశమున్నందున పూల మొక్కలతోపాటు ఆహ్లాదకర వాతావరణం ఉండేలా కృషి చేయాలని సూచించారు. అలాగే 4వ వార్డులోని వాటర్ ట్యాంకు వద్దకొచ్చి ట్యాంకులో వచ్చే నీటిలో ఫ్లోరైడ్ శాతం ఎంత ఉందో పరిశీలించారు. పట్టణ పరిధిలోని హన్మంతాపూర్‌లో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీపీవో యాదయ్య, డీఆర్డీపీడీ శ్రీనివాస్‌రావు, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, కమిషనర్ జైతురాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.


కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయం

శ్రావణమాసం శుభకరం

● కేతకీలో నెలరోజుల పాటు కొనసాగనున్న ప్రత్యేక పూజలు

ఝరాసంగం, ఆగస్టు 6: దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసం పూజలు కొనసాగుతున్నాయి. సోమవారం ప్రారంభమైన పూజలు ఆలయంలో నెలరోజులపాటు జరగనున్నాయి. కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి అభిషేకాలు చేసి మొక్కులు తీర్చుకుంటారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. శ్రావణమాసంలో నాలుగవ సోమవారం మహారాష్ట్రలోని అమహదపూర్ నుంచి వేలాదిమంది భక్తులు భజన కార్యక్రమాలతో పాదయాత్రగా స్వామి దర్శనం కోసం తరలివస్తారు. శ్రావణమాసం సందర్భంగా జహీరాబాద్ నుంచి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడుపుతారు.

ఆలయాల్లో శివరాధన



శ్రావణమాసం ఎంతో పవిత్రమైనది. ఆలయాల్లో శివుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేపడుతారు. నెలరోజులపాటు కేతకీ ఆలయం భక్తులతో రద్దీగా ఉంటుంది. కర్ణాటక, మహారాష్ట్రతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు.

- సంగయ్య స్వామి, అర్చకుడు

ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు



శ్రావణమాసాన్ని దృష్టిలో పెట్టుకొని ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. భక్తులకు కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశాం.

- శశిధర్‌గుప్తా, ఆలయ ఈవో


సంగారెడ్డి రూరల్: కలెక్టరేట్‌లో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్


కంది: ఎంపీడీవో కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎంపీడీవో, సిబ్బంది


జిన్నారం: బొల్లారంలో నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, అధికారులు


పుల్‌కల్: జేఎన్‌టీయూలో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది


నారాయణఖేడ్‌లో జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి


ఖేడ్‌లో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జిల్లా కాంగ్రెస్ నాయకులు


జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి


సంగారెడ్డి రూరల్: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నివాళ్లు అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని చాటిన

మహనీయుడు జయశంకర్

తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిప్రదాత, దివంగత ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వకార్యాలయాలు, పాఠశాలలు, ఆయా పార్టీల కార్యాలయాల్లో జయశంకర్ చిత్రపటాలు ఏర్పాటు చేసి నివాళులర్పించారు. గ్రామాలు, మండల కేంద్రాల్లో జయశంకర్ విగ్రహాలకు తెలంగాణ ఉద్యమకారులు పూలమాలలు వేసి, ఆయన త్యాగనిరతిని కొనియాడారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని ఎందరికో చాటిచెప్పిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో డీఆర్వో పద్మజారాణి, కలెక్టరేట్ ఏవో పరమేష్, వివిధ శాఖల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రొ. జయశంకర్ చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకులు పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. పుల్‌కల్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ జి.నరసింహ మాట్లాడుతూ.. తెలంగాణ సిద్ధాంతకర్తగా, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ప్రొఫెసర్ జయశంకర్ అని అన్నారు. మెదక్ కలెక్టరేట్‌లో ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏవో యూనస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆయన ఆశయసాధనకు కృషి చేయాలన్నారు. మెదక్ టీఎన్జీవో సంఘం భవన్‌లో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. జయశంకర్ సార్ జీవితం మనందరికీ స్ఫూర్తిదాయకమని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ పేర్కొన్నారు. అదేవిధంగా మెదక్ పంచాయతీరాజ్‌శాఖ ఈఈ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఇంజనీరింగ్ అధికారులు నివాళులర్పించారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్, ఆగస్టు 6


బీఆర్ఎస్ మెదక్ కార్యాలయంలో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


మెదక్‌లోని పీఆర్ ఈఈ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది


మెదక్ టీఎన్జీవో భవన్‌లో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు


టేక్మాల్ చౌరస్తాలో జయశంకర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


చేగుంట ఎంపీడీవో కార్యాలయంలో జయశంకర్ జయంతి కార్యక్రమంలో సిబ్బంది


పెద్దశంకరంపేట: స్వర్ణకార సంఘం భవనంలో జయశంకర్ జయంతిలో నివాళులర్పిస్తున్న సభ్యులు


మాసాయిపేట: చెట్లతిమ్మాయిపల్లి పాఠశాలలో జయశంకర్ జయంతిలో విద్యార్థులు


మాసాయిపేట: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


తూప్రాన్‌లో జయశంకర్‌కు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జడ్పీ సీఈవో


మనోహరాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నివాళులర్పిస్తున్న విద్యార్థులు


చిన్నశంకరంపేట: చెన్నాయిపల్లి పాఠశాలలో చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్డీవో, అధికారులు

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో రెండోరోజైన మంగళవారం ముమ్మరంగా కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా అధికారులు స్థానిక సిబ్బందితో కలిసి గ్రామాల్లో పర్యటించి ప్రజలకు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో మొక్కలు నాటి పచ్చదనం ప్రాముఖ్యతను వివరించారు.

సంగారెడ్డి రూరల్/జహీరాబాద్/కంది/ పుల్‌కల్/నారాయణఖేడ్/ ఆగస్టు 6: గ్రామాలు పరిశుభ్రంగా పచ్చగా ఉంటేనే సీజనల్ వ్యాధులు మనకు దూరంగా ఉంటాయని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. మంగళవారం సంగారెడ్డి మండలం కల్బగూర్ గ్రామంలో ఆమె మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు అంజనేయులు, లావణ్యదుర్గేష్, మాజీ సర్పంచులు పాల్గొన్నారు. జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(బి), చిరాగ్‌పల్లి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో జడ్పీ సీఈవో జానకిరెడ్డి పాల్గొని కార్యక్రమాలను పరిశీలించి మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో మహేందర్ రెడ్డి, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు. పట్టణంలోని మున్సిపాలిటీలో మున్సిపల్ జాయింట్ డైరెక్టర్ నారాయణరావు పాల్గొని స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలను పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సంధ్య, సిబ్బంది ఉన్నారు. కంది మండలంలోని అన్ని గ్రామాల్లో మంచి నీటి మోటర్లను, నీటి కుంటలు, చెరువులు, కుంటలు ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. పాడైపోయిన మోటార్లకు మరమ్మతులు చేయించారు. చౌటకూర్ మండలం కోర్పోలు గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం అవగాహన సదస్సుకు ఎంపీడీవో ఆనందమేరీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.అనంతరం గ్రామంలోని వీధుల్లో పర్యటించి పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. నారాయణఖేడ్ ఏరియా వైద్యశాల ఆవరణలో మంగళవారం వైద్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది సంయుక్తంగా స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ఆనంద్ స్వరూప్‌షెట్కార్, వైస్ చైర్మన్‌దారం శంకర్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.రమేష్, కమిషనర్ జగ్జీవన్, కౌన్సిలర్లు ఉన్నారు.


సంగారెడ్డి మండలం కల్బగూర్‌లో మొక్క నాటుతున్న టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మల


కొల్చారం: సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో మొక్కలు నాటుతున్నవిద్యార్థినులు

మెదక్ జిల్లాలో..

● మెదక్ మున్సిపాలిటీ/ నిజాంపేట/టేక్మాల్/ కౌడిపల్లి/తూప్రాన్/ కొల్చారం/వెల్దుర్తి/నర్సాపూర్/అల్లాదుర్గం/చిన్నశంకరంపేట/పెద్దశంకరంపేట/ రేగోడు, ఆగస్టు 6: స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా మంగళవారం సిబ్బంది మెదక్ పట్టణంలోని 12 నీటి ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ పరీక్షలు చేపట్టారు. వార్డుల పర్యటన అనంతరం గోసముద్రం, పిట్లంచెరువుల వద్ద అధికారుల బృందం మంచినీటి సదస్సులు నిర్వహించారు. ఇంటి యజమానులు ఇంకుడుగుంతలు తప్పనిసరిగా నిర్మించుకోవాలని నోటీసులు జారీచేశారు. నిజాంపేట మండల పరిధిలోని నందిగామ, కల్వకుంట గ్రామాల్లో మంగళవారం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ పర్యటించి మొక్కలు నాటారు. టేక్మాల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో డీఎల్పీవో సురేష్‌బాబు రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉంటూ గ్రామంలో పారిశుధ్య పనులను చేపట్టాలని తెలిపారు. కౌడిపల్లిలో గ్రామపంచాయతీ పరిధిలోని పలు కాలనీలను నర్సాపూర్ డివిజన్ పంచాయతీ అధికారి సాయిబాబ పరిశీలన చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఎంపీడీవో శ్రీనివాస్‌తో కలసి మొక్కలు నాటారు. తూప్రాన్ రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఆవరణలో ఆర్డీవో జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా చెత్తను, పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యాలయంలో ఆఫీసు గదులను శుభ్రం చేశారు.కొల్చారంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల ఆవరణలో విద్యార్థినులతో కలిసి పాఠశాల ప్రిన్సిపాల్ సత్యకుమారి పంచాయతీ కార్యదర్శి అంజయ్య మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ధనలక్ష్మి, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ బేగం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. వెల్దుర్తి మండలంలోని పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలోకి వచ్చే మిషన్ భగీరథ నీటిని పలుచోట్ల పరీక్షించారు. అలాగే గ్రామాల్లోని చెరువు కట్టలపై మొక్కలను నాటారు. మండల కేంద్రమైన వెల్దుర్తితో పాటు ఆయా గ్రామాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాదేవి పాల్గొని మొక్కలు నాటారు. నర్సాపూర్ మండలంలోని తుల్జారాంపేట, మాడాపూర్, గూడెంగడ్డ తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే సునీతారెడ్డి పర్యటించి మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా మొక్కలను కూడా పెంచాలని సూచించారు. అల్లాదుర్గం మండలంలోని కాయిదంపల్లి గ్రామశివారులోని ఊరచెరువు కట్టపై ఎంపీడీవో శంకర్ యాదవ్ ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. చిన్నశంకరంపేట పీహెచ్‌సీని పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ రవీందర్ ఆకస్మికంగా సందర్శించి స్వచ్ఛదనం-పచ్చదనం పనులను పరిశీలించారు. ఆయన వెంట మెదక్ జడ్పీ సీఈవో ఎల్లయ్య, మండల ప్రత్యేకాధికారి వెంకటయ్య, ఎంపీడీవో దామోదర్, తదితరులు ఉన్నారు. పెద్దశంకరంపేట మండలంలోని పలు గ్రామాల్లో తహసీల్దార్‌గ్రేస్‌బాయ్, ఎంపీడీవో రఫీక్‌ఉన్నిసాలు మంగళవారం ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మొక్కలనునాటారు. రేగోడు మండలకేంద్రంలో వాటర్ ట్యాకుల వద్ద పరిశుభ్రత పాటించారు. ఇళ్ల వద్ద వర్షం నీరు నిలవకుండా, పరిసరాల్లో పిచ్చి మొక్కలు లేకుండా జాగ్రత్త చూసుకోవాలని పంచాయతీ, వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు.

ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకా వంటివి

సంగారెడ్డి అర్బన్/పుల్‌కల్/నాగల్‌గిద్ద, ఆగస్టు 6: ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకా వంటిదని సీడీపీవో చంద్రకళ తెలిపారు. సంగారెడ్డిలోని ఎంసీహెచ్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన నుంచి కనీసం ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. పుల్కల్ మండలంలోని ముదిమాణిక్యంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమానికి ఐసీడీఎస్ జోగిపేట ప్రాజెక్టు సీడీపీవో ప్రియాంక ముఖ్యఅతిథిగా హాజరై తల్లి పాల విశిష్టతపై మహిళలకు అవగాహన కల్పించారు. నాగల్‌గిద్ద అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల పాల్గొని మాట్లాడుతూ ముర్రు పాలు బిడ్డకు జీవితాంతం రోగనిరోధక శక్తి ఇస్తాయన్నారు.

● చేగుంట/పాపన్నపేట/అల్లాదుర్గం/చిలప్‌చెడ్, ఆగస్టు 6: తల్లి పాలు పిల్లలకు అమృతంలాంటివని డిప్యూటీడీఎంహెచ్‌వో జ్ఞానేశ్వర్ పేర్కొన్నారు. మెదక్ జిల్లా నార్సింగి మండల కేంద్రంలోని రెడ్డి సంఘంలో ఐసీడీఎస్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన తల్లి పాల వారోత్సవాల కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ ముర్రు పాల ప్రాధాన్యంపై వివరించారు. పాపన్నపేట మండలంలోని పాత లింగాయి పల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం 1మరియు 2 కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్ వైజర్ మంజుల, అంగన్‌వాడీ టీచర్లు, ప్రజలు పాల్గొన్నారు. అల్లాదుర్గం మండలంలోని గడిపెద్దాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్ యాదవ్ మాట్లాడుతూ తల్లిపాలతో పిల్లల శారీరక వికాసం మానసిక వికాసం వృద్ధి చెందుతుందని వివరించారు. చిలప్‌చెడ్ మండల పరిధిలోని చిట్కుల్ తాండా అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీస్ సూపర్‌వైజర్ సంతోషిమాత పాల్గొని తల్లి పాల గొప్పదనం గురించి బాలింతలకు గర్భిణులకు వివరించారు.


పాపన్నపేటలోని అంగన్‌వాడీలో తల్లిపాల దినోత్సవం

ఉత్సాహంగా అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీలు


పరుగు పందెంలో పోటీపడుతున్న క్రీడాకారులు

మెదక్ అర్బన్, ఆగస్టు 6: 10వ తెలంగాణ స్టేట్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ జిల్లాస్థాయి పోటీలు మంగళవారం స్థానిక ఇందిరాగాంధీ మైదానంలో ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్-23 బాల బాలికలకు రన్స్, త్రో, జంప్స్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 10మంది క్రీడాకారులు ఈ నెల 17, 18వ తేదీల్లో మెదక్ స్టేడియంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి మధుసూదన్ తెలిపారు.

రూప్లా తండాలో చెట్లు నరికివేత

శివ్వంపేట, ఆగస్టు 6: ప్రభుత్వం పచ్చదనానికి ప్రాముఖ్యమిస్తూ మొక్కలు నాటుతుండగా కొందరు ప్రబుద్ధులు చెట్లు నరికివేస్తుండటంపై పలువురు మండిపడుతున్నారు. మండల పరిధిలోని రూప్లాతండాలో గత ప్రభుత్వ హయాంలో ఆరేళ్ల క్రితం హరిత హారంలో భాగంగా రోడ్డుకిరువైపులా నాటిన మొక్కలు ఏపుగా పెరిగి పెద్దచెట్లుగా ఎదిగాయి. అయితే ఈ చెట్లను తండాకు చెందిన మాజీ ఇన్‌చార్జి సర్పంచ్ రాంసింగ్ ఇష్టారీతిగా నరికి వేశాడని మాజీ సర్పంచ్ రూప్లా నాయక్ ఆరోపించారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

షాట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం


దగ్ధమైన ఇంటివద్ద బాధిత కుటుంబం

చిలప్‌చెడ్, ఆగస్టు 6: మండలం పరిధిలోని సోమక్కపేట గ్రామంలో సోమవారం అర్ధరాత్రి ఓ పూరిల్లు షాట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. మంగళవారం స్థానికులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. సోమక్కపేట గ్రామానికి చెందిన బుజిరంపేట పద్మ తన భర్త పిల్లలు కుటుంబ సభ్యులతో కలసి ఆ ఇంట్లో నివాసముంటున్నారు. సోమవారం అర్ధరాత్రి సమయంలో వారి ఇంట్లో షాట్ సర్క్యూట్ జరిగి మంటలులేచి పూర్తిగా దగ్ధమైంది. మంటల్లో ఇంటి పత్రాలతో పాటు తన భర్త చికిత్స కోసం అప్పు చేసిన దాచిన రూ. 2.50 లక్షలు , ఇతర సామగ్రి మొత్తం కాలి బూడిదయ్యాయని బాధితురాలు కన్నీరు మున్నీరైంది. కట్టు బట్టలతో మిగిలిన తన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తహసీల్దార్‌ను కోరారు.

రోడ్డు విస్తరణ నష్టనివారణకు ఫ్లై ఓవర్‌ను నిర్మించాలి


చీఫ్ ఇంజనీర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, ఆగస్టు 6: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పటాన్‌చెరు పట్టణంలో పెద్ద ఎత్తున వాణిజ్య భవనాలను తొలగించకుండా ప్రత్యామ్నాయంగా ఫ్లై ఓవర్‌ను నిర్మించి నష్టాన్ని తగ్గించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి రోడ్లు భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్ గణపతిరెడ్డికి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. మియాపూర్ నుంచి పటాన్‌చెరు మీదుగా సంగారెడ్డి వరకు జాతీయ రహదారిని ఆరు లైన్లకు విస్తరణ పనులు ఇటీవలే ప్రారంభమయ్యాయి. రోడ్డుకు ఇరువైపుల పెద్ద ఎత్తున ఉన్న భవనాలను తొలగించి భూ సేకరణ చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నష్టాన్ని నివారంచే ప్రయత్నంలో భాగంగా ఫ్లై ఓవర్ ప్రతిపాదన ముందుకు వచ్చిందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి వివరించారు. త్వరలోనే రోడ్లు భవనాలశాఖ అధికారులు పటాన్‌చెరును సందర్శించి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తారని చీఫ్ ఇంజనీర్ గణపతిరెడ్డి ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే చెక్కుల పంపిణీపై కాంగ్రెస్ నాయకుల అసంతృప్తి

జిన్నారం, ఆగస్టు 6: బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులతో కలిసి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేయడం పట్ల కాంగ్రెస్ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం బొల్లారంలో మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు రాధ, చంద్రయ్య, కో ఆప్షన్ సభ్యులు మునీర్, నాయకులు వరప్రసాద్‌రెడ్డిలు సమావేశం నిర్వహించారు. ఇటీవల పటాన్‌చెరులో లబ్ధిదారులకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులు బీఆర్ఎస్ నాయకులతో కలిసి పంపిణీ చేయడం సరికాదన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరుగకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమణయ్య, రాజ్‌గోపాల్, చక్రపాణి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఉద్యోగులకు మంచి పీఆర్సీ ఇప్పిస్తాం

● ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి

పాపన్నపేట, ఆగస్టు 6: రైతు రుణమాఫీ పూర్తి కాగానే ఉద్యోగులకు మంచి పీఆర్సీ ఇప్పిస్తామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పాపన్నపేటలో ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు చెన్నమొల్ల కిషన్ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఉపాధ్యాయుల సమస్య లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోల్ల శశిధర్ రెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్ రావు, జిల్లా విద్యాశాఖ అధికారి రాధా కిషన్, డీఎస్‌వో రాజిరెడ్డి, మండల విద్యాధికారి నీలకంఠం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చేగుంట మండలంలో తపస్ సభ్యత్వ నమోదు

చేగుంట, ఆగస్టు 6: మండలంలోని పలు పాఠశాలల్లో తపస్ జిల్లా అధ్యక్షులు జిడ్డి ఎల్లం ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్ అధ్వర్యంలో మంగళవారం తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలకు ఉచిత విద్యుత్ అందిస్తామని చెప్పడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తపస్ జిల్లా ఉపాధ్యక్షుడు దేశపతి కృష్ణమూర్తి, తూప్రాన్ డివిజన్ కార్యదర్శి ప్రభాకర్, చేగుంట మండల అధ్యక్షులు రావుల వేంకటేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను ఆదుకోవాలి

● టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేష్

చిన్నశంకరంపేట, ఆగస్టు 5: జీవో 317 స్థానికత కోల్పోయి ఉపాధ్యాయులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేష్ అన్నారు. మండలంలోని పలు పాఠశాలలో మంగళవారం టీఆర్‌టీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రణీద్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐలయ్య, రాష్ట్ర సభ్యత్వ నమోదు కన్వీనర్ ప్రభాకర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు సిద్దిరాములు మండల అధ్యక్షుడు విఠోబా, మండల ప్రధాన కార్యదర్శి రజనీకాంత్ పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్లు పెంచాకే స్థానిక ఎన్నికలు జరపాలి

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 6 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ సీడీసీ చైర్మన్ పి. ప్రభుగౌడ్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు మంగళవారం వినతి పత్రం అందజేసి ఆయన మాట్లాడారు. వినతి పత్రం అందజేసిన వారిలో సంఘం నాయకులు కిష్టయ్య, వెంకటేష్, సుధాకర్, శ్రీనివాస్. ఎండి. జావేద్, అంతయ్యచారి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

జిన్నారం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన అదనపు ఎస్పీ

జిన్నారం, ఆగస్టు 6: జిన్నారం పోలీస్‌స్టేషన్‌ను జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు తనిఖీ చేశారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన అదనపు ఎస్పీ కేసుల నమోదు, రికార్డుల నిర్వాహణను పరిశీలించారు. అనంతరం సీఐ సుధీర్ బాబు, ఎస్ఐ నాగలక్ష్మి, ఏఎస్ఐ సుధాకర్, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు.

నంబరుప్లేట్లు లేకుండా వాహనాలను నడిపితే చర్యలు

జహీరాబాద్, ఆగస్టు 6: జహీరాబాద్ పట్టణంలో వాహనాలకు నంబర్ ప్లేట్లు లేకుండా నడిపితే చర్యలు తీసుకుంటామని జహీరాబాద్ పట్టణ ఎస్ఐ కాశీనాథ్ పేర్కొన్నారు.మంగళవారం పట్టణంలోని భవానీమందిర్ చౌరస్తా వద్ద వాహనాల తనఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా 6డ్రంకెన్‌డ్రైవ్, నంబరు లేని 8వాహనాలను సీజ్ చేశారు.తనఖీల్లో రూరల్ ఎస్ఐ. ప్రసాదరావు, పోలీసులు పాల్గొన్నారు.

బస్సుల కోసం విద్యార్థుల ధర్నా

హవేళిఘణపూర్, ఆగస్టు 6: మండలంలోని భూర్గుపల్లి గ్రామంలో బస్సుల కోసం విద్యార్థులు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాజిపేట, కొత్తపల్లి, వాడి, బూర్గుపల్లి గ్రామాలకు బస్సులు రాకపోవడం వల్ల సరైన సమయానికి పాఠశాలు, కాలేజీలకు చేరుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, నాయకులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ధర్నాలో ఎస్ఎఫ్ఐ నాయకులు అజయ్, రవి, ఆనంద్, ప్రణయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

గద్దర్‌కు ఘన నివాళి

తూప్రాన్/నిజాంపేట/వట్‌పలి, ఆగస్టు 6: యుద్ధనౌక గద్దర్ ప్రథమ వర్ధంతిని మంగళవారం స్వగ్రామమైన తూప్రాన్ పట్టణంలో బీఆర్ఎస్ ఉద్యమ నాయకుడు మన్నె శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. తూప్రాన్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద గద్దర్ చిత్రపటం ఏర్పాటు చేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు మామిండ్ల కృష్ణ ముఖ్య అతిధులుగా హాజరై గద్దర్ సేవలను గుర్తి చేశారు. నిజాంపేట మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గద్దర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుబాసి సంజు ఆధ్వర్యంలో చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కొమ్మట బాబు, తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు. వట్‌పల్లి మండలకేంద్రంలో గద్దర్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. అనంతరం గద్దర్ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో వట్‌పల్లి మాజీ సర్పంచ్ సంగారెడ్డి, గోపాల్‌రెడ్డి, నాయకులు మధు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.